పారిశుధ్యలోపం తలెత్తకుండా చూడాలి

- పంచాయతీల్లో కొనసాగుతున్న పారిశుధ్య వారోత్సవాలు
- పాల్గొన్న పలువురు ప్రత్యేక అధికారులు

బొంరాస్‌పేట : మదన్‌పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీవో మహేశ్‌కుమార్



మర్పల్లి: కొత్లాపూర్‌లో నర్సరీ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ గణేశ్

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 8 : గ్రామాల్లో పారిశుధ్యలోపం తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీవో మహేశ్‌కుమార్ అన్నారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ సందర్భంగా గురువారం మండలంలోని మదన్‌పల్లి, లోతుకుంటతండాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రత, తడిపొడి చెత్త వేరు చేయడం గురించి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో మంజూరైన పనులను చేపట్టే విషయమై చర్చించారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు రహదారులను శుభ్రం చేశారు. ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు తాండూరు మండలంలోని 33 పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని అంతారం గ్రామంలో తాగునీటి పైపులైన్ లీకేజీలను సరి చేశామని, అలాగే కట్టింగ్ యంత్రంతో పిచ్చిమొక్కలను తొలగించామని అంతారం ప్రత్యేకాధికారి విజయేందర్ తెలిపారు. గౌతాపూర్‌లో మురుగు కాల్వలను పరిశుభ్రం చేయించామని పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీ తెలిపారు. వీటితోపాటు ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

మర్పల్లి: గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దని తహసీల్దార్ గణేశ్ సూచించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని సిరిపురం, కొత్లాపూర్, తుమ్మలపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు మురుగు కాల్వలు, రోడ్లను శుభ్రం చేయాలన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కొరత రాకుండా చూడాలన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రవికుమార్ పాల్గొన్నారు.

కులకచర్ల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఎర్రగోవిందన్‌తండా గ్రామంలో గ్రామ ప్రత్యేక అధికారి రమేశ్‌కుమర్‌తో కలిసి గ్రామాభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సరఫరా, పైపులైన్ల లీకేజీల నివారణ, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు నీటిని అందించాలన్నారు. అనంతరం గ్రామ పరిధిలోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. కులకచర్ల గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ మురళీధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సమస్యలపై పంచాయతీ కార్మికులతో చర్చించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

కులకచర్ల: ఎర్రగోవిందన్‌తండాలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, ప్రత్యేక అధికారి రమేశ్‌కుమార్

తాండూరు రూరల్: అంతారంలో తాగునీటి పైపులైన్‌ను మరమ్మతు చేయిస్తున్న అధికారులు

పరామర్శ..

వికారాబాద్, ఫిబ్రవరి 8 : చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని సోమాజి గూడ యశోధ దవాఖానలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రమేశ్ గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దేముల్, ఫిబ్రవరి 8 : మండల పరిధిలోని మారేపల్లి గ్రామం గేటు సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సహాయ వంట మనుషుల నియామకం కోసం అర్హులు, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈవో వెంకటయ్య గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 7వ తరగతి ఉత్తీర్ణతతో పాటు 18 నుంచి 45 ఏండ్ల వయసు ఉన్న మహిళలు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15లోపు దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.

నవాబుపేట: మండల పరిధిలోని మాడల్ స్కూల్‌కు సంబంధించి బాలికల వసతి గృహంలో పని చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎంఈవో గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నైట్ వాచ్‌మన్-1, హెడ్‌కుక్-1, అసిస్టెంట్ కుక్‌లు-2 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి చదివి, 18 ఏండ్లు నిండి ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా చండీ హోమం

కందుకూరు. ఫిబ్రవరి 8: మండల పరిధిలోని దాసర్లపల్లిలో ఘనంగా చండీ హోమం నిర్వహించారు. చండీ ఉపాసకులు రేవెల్లె రాజుశర్మ ఆధ్వర్యంలో గురువారం దివంగత జనార్దన్ శర్మ వ్యవసాయ క్షేత్రంలో ఉదయం కుంకుమార్చాలను నిర్వహించిన అనంతరం వివిధ రకాల హోమాలు నిర్వహించారు. అనంతరనం ఈ మాసం ప్రత్యేకంగా మహాలక్ష్మి హోమాన్ని నిర్వహించారు. హోమాల అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు ఉచితంగా అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

సైదాబాద్ డివిజన్ పరిధిలోని గడ్డిఅన్నారం పిల్లిగుడిసెల బస్తీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, సకాలంలో పనులను పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మలక్‌పేట ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

– సైదాబాద్, ఫిబ్రవరి 8

పత్రికా ప్రకటన

నా పేరు ముదాగుల వరప్రసాదు Age: 48 S/o. ముదాగుల వీర వెంకట సత్యనారాయణ రావు మాది ప్రస్తుతం నివాసం విజయవాడ మాకు హైదరాబాద్ శివారు శంకరపల్లి విలేజ్‌లో సర్వే నం.334, 335లో 5 ఎ. 12 కుంటల స్థలం ఉన్నది మా నాన్న గారి పేరు ముదాగు వీర వెంకట సత్యనారాయణ రావు S/o. బోజ రాజు (అలయాస్ M.V.V. సత్యనారాయణ) మా తండ్రి గారు నా పేరు బోగాస్ అగా సర్వేను కంపెనీ పేరున ఉన్నది. దాక్యుమెంట్ ఉన్నది. ఆ భూమి కొందరు సంఘవిద్రోహ శక్తులు కాజేయాలని మరియు మాజీ సర్పంచ్ రామిరెడ్డి ముల్కపుర ఇరువురు కలిసి దూష్టికేట్ దస్తావేజులు మరియు మా తండ్రి గారి ID ప్రూఫ్ సృష్టించి రాయువరపు బాబు ముతా మరియు నా తండ్రి పేరు ముళ్ళపూడి సత్యనారాయణగా మార్చి ఒక ఫేక్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ డాక్యుమెంట్ నం. 3703/2023 చేసినారు. మా ఇంటి పేరు ముదాగుల మా కులం భట్టి రాజులు. కనుక మా తాత గారి పేరు బోజరాజు గారు మేము రాజుల కులస్థులం రాయువరపు బాబు ముతా ఇంటి పేరును పూర్తి ముళ్ళపూడిగా చూపిస్తున్నారు. మా ఇంటి పేరు ముళ్ళపూడి మా కులము లేదు తర్వాత మేము శంకరపల్లి పోలీస్ స్టేషన్‌లో కంప్లెంట్ చేశాము. రాయువరపు బాబుపై మరియు ప్రాజెక్ట్ X కంపెనీ Rep by విజయలక్ష్మి IPC సెక్షన్ క్రింద 419, 420, 468, 471 సెక్షన్ క్రింద FIR నం. 31/2024. నమోదు చేయబడినది. నేను సదరు భూమి నీలం గౌడ్ అతని other పేర్ల మీద ది: 20-01-2024న రిజిస్ట్రేషన్ చేయుట జరిగినది ఆయన పిమ్మట ఈ భూమిని రాయువరపు బాబు మరియు ముతా కాజేయాలని తప్పుడు పేపరు ప్రకటన ఇచ్చినారు మరియు రెవెన్యూ రికార్డులో కూడా మా పేరు తారుమారు చేయుటకు చూసినారు. సర్కారు వారిని తప్పుదారి పట్టిస్తున్నారు. ఈ భూమి తాలూకా జరిగిన సమయంలో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ మాజీ శంకరపల్లి MRO గారు హస్తం కూడా ఉంది. మేము చేసిన రిజిస్ట్రేషన్ చట్ట ప్రకారం జరిగింది. ఎవ్వరికీ ఈ భూమి మీద ఎవ్వరికీ హక్కు లేదు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయుట జరిగింది. నేను ఈ రోజు గౌరవనీయులైన తెలంగాణ ముఖ్యమంత్రి గారికి తెలియజేయడానికి వచ్చినాను. కాని ఆ సమయంలో ముఖ్యమంత్రి గారు లేరు అందుచేత మేము పత్రికా ప్రకటన చేయడం జరిగింది నాకు రాయువరపు బాబు అలయాస్ ముళ్ళపూడి సత్యనారాయణ మరియు ముల్కపుర మాజీ సర్పంచ్ రామిరెడ్డి అతని అనుచరులు కొంతమంది దుండగులు వీరంతా నన్ను చంపుతామని బెదిరింపులు చేస్తున్నారు అయిన నాకు ప్రాణ భయం ఉంది కనుక నేను పత్రికి వారికి విన్నవించుకుంటున్నాను.

ఇట్లు: ముదాగుల వరప్రసాద్
S/o. లేట్ ముదాగుల వీరవెంకట సత్యనారాయణరావు
సం/– కె. సుధాకర్, అడ్వకేట్
ఫ్లాట్ నం.102, at II NCC అర్బన్ గార్డెనియా, గచ్చిబౌలి, హైదరాబాద్-32, ఫోన్: 040-23543412

వట్టిమీనాపల్లిలో భారీ చోరీ

38 తులాల బంగారం, 40 తులాల వెండి రూ.60వేల నగదు మాయం

చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ బృందం

నవాబుపేట, ఫిబ్రవరి 8: మండల పరిధిలోని వట్టిమీనాపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో భారీ చోరీకి పాల్పడిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు బాధితుడు సుక్కమోళ్ల చంద్రశేఖర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై డీఎస్పీ నర్సింహులు, సీఐ ఆంజనేయులు, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ బల్వంతయ్య విచారణ చేసి వివరాలు వెల్లడించారు. ఎస్సై భరత్ భూషణ్ తెలిపిన వివరాలు.. చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం తన తల్లితో కలిసి హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు వెళ్లారు. ఆయన భార్య పిల్లలతో కలిసి ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 8న బాధితుడి వదిన ఫోన్ చేసి ఇంటికి వేసిన తాళం తీసి ఉందని, ఇంట్లో ఎవరూ లేరని అడిగింది. బాధితుడు వెళ్లి చూసి ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించాడు. ఈ ఘటనలో 38 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.60వేల నగదు పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. త్వరలోనే నిందితులను పట్టుకొంటామన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

బడంగ్‌పేట, ఫిబ్రవరి8: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక తెలిపారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దావూద్ ఖాన్ గూడలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిషనర్ ఆఫ్ కాలేజీ యేట్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో ఎంఎస్ ఆఫీస్, ప్రోగ్రాం ఇన్ ఫైతాన్, ఫీవర్ బీవై, కమ్యూనికేషన్ స్కిల్, జాబ్ రెడినెస్ స్కిల్ వంటి వాటిపై విద్యార్థులకు పదిరోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. లర్నింగ్ లింక్ ఫౌండేషన్ సంస్థ, డీఎల్ టెక్నాలజీతో అను సంధానం చేస్తూ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. అనుకున్న రంగాలలో రాణించాలంటే విద్యార్థులు సాధన చేయాలన్నారు. నేర్చుకున్న అంశాలను పదే పదే నెమరు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ చందో జిరావ్, డాక్టర్ కరీముల్లా కో, కోర్డినేటర్లు డాక్టర్ కిరణ్ మై, రాంగోపాల్ రెడ్డి, కృష్ణవేణి, తనూజా,రాజేశ్వరి, సుస్మిత, శ్రీనివాస్, సురేశ్, ఆనంద్, దీపిక కళ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించాలి

కందుకూరు. ఫిబ్రవరి 8 : సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్ సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీంలాల్ పవార్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 15న సేవాలాల్ జయంతి రోజున సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న శోభాయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కొర్ర రాజు నాయక్, బాణావత్ బాబు నాయక్, మోహన్ నాయక్, రవి నాయక్, శంకర్ నాయక్, నరేందర్ నాయక్, శ్రీను నాయక్, ఉపేందర్ నాయక్, మల్లేశ్ నాయక్, బిక్కు నాయక్, చత్రునాయక్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి



ఎంపీవో షేక్ సుష్మాకు సమ్మె నోటీసును అందజేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పంచాయతీ కార్మికులు

పెద్దేముల్, ఫిబ్రవరి 8 : దేశవ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహిస్తున్న కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ తెలంగాణ గ్రామ పంచాయతీ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీవో షేక్‌సుష్మాకు సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు గడుస్తున్నా కార్మికులు, రైతాంగ సమస్యలను పరిష్కరించలేదన్నారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.10వేలు, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్లతో నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు అంబరప్ప, సభ్యులు రాములు, శ్రీనివాస్, సంగప్ప, వెంకటమ్మ, బాలమణి, చంద్రమ్మ, పద్మ, నర్సింహులు, అనుసూజ, పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారిణులకు టీ షర్టుల పంపిణీ

క్రీడాకారిణులకు టీ షర్టులు అందజేస్తున్న జిల్లా ఖోఖో అధికారి హనుమంతు

పరిగి టౌన్, ఫిబ్రవరి 8 : నల్లగొండ జిల్లాలో జరుగనున్న ఉమెన్స్ ఖోఖో పోటీల్లో పాల్గొనన్న క్రీడాకారిణులకు స్థానిక మినీస్టేడియం ఆవరణలో గురువారం టీ షర్టులు పంపిణీ చేశారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి సౌజన్యంతో జిల్లా ఖోఖో అధికారి హనుమంతు టీ షర్టులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ మాణిక్యం, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పరుశురాంరెడ్డి, కౌన్సిలర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదులో సహకరించాలి

పలు పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో సూరజ్ కుమార్

కందుకూరు. ఫిబ్రవరి 8 : నియోజకవర్గంలో ఓటరు నమోదు కార్యక్రమంలో నాయకులు సహకరించాలని ఆర్డీవో సూరజ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో తుది జాబితాను విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన నాయకులు సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకు తుది జాబితా ప్రకారం 5 లక్షల 55వేల 976మంది ఓటర్లు నమోదు కాగా, 511పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు.

తుది జాబితా అనంతరం నేటి నుంచి కూడా ఓటర్ల నమోదు కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. బీఎల్ఓలు రాజకీయ పార్టీల నాయకుల వద్ద ఓటరు లిస్టులను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. తమ పేర్లను పోలింగ్ కేంద్రాల వద్ద ఉంచిన ఓటర్ లిస్టుల్లో పరిశీలించుకోవాలని కోరారు. ఏఓ జ్యోతి, ఎన్నికల డీటీ శేఖర్, సిబ్బంది వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

నవాబుపేట, ఫిబ్రవరి 8: అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందేలా డాటా ఎంట్రీలో లోపాలు లేకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. గురువారం మండలం పరిధిలోని చిట్టిగిద్ద, నవాబుపేట, దాతాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. డాటా ఎంట్రీలో పొరపాట్లు లేకుం డా జాగ్రత్తగా అర్హుల వివరాలను నమోదు చేయాలని గుర్తు చేశారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, తహసీల్దార్ జయరాం, ఎంపీవో విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై యువతకు శిక్షణ

శిక్షణ పొందిన యువతీయువకులతో అధికారులు

వికారాబాద్, ఫిబ్రవరి 8: నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఒకరోజు శిక్షణ ఇచ్చామని ఉపాధి కల్పన జిల్లా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉపాధి, శిక్షణ డైరెక్టరేట్ సంకల్ప్ స్కిల్ డెవలప్‌మెంట్, ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని ఓ హోటల్‌లో నిరుద్యోగ యువతకు గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాన్ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి, వేతన ఉపాధికి సంబంధించి మహిళలు, యువతకు ఉండే అవకాశాలపై అవగాహన కల్పించామన్నారు. 89 మంది యువతీ యువకులు ఈ శిక్షణకు హాజరయ్యారని, ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్లు, కిట్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు, ట్రైనర్లు వెంకటేశ్, శ్రీధర్, ఏపీసీసీ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ దుర్గారెడ్డి, కన్సల్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న కడాప్రత్యేకాధికారి

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 8 : మండలంలోని 59 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని బురాన్‌పూర్ గ్రామానికి సమీపంలో బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని వెంకట్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సర్పంచ్‌లు, లబ్ధిదారులు, కాంగ్రెస్ మండల నాయకుడు నర్సింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ పారా మెడికల్ అధికారి విజయ భాస్కర్

ధారూరు, ఫిబ్రవరి 8 : కుష్టు వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి విజయభాస్కర్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కుక్కింద జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కుష్టువ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కుష్టువ్యాధి నివారణ చర్యలను ఎలా తీసుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం కుష్టువ్యాధి నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, గౌరీశంకర్, శ్రీనివాస్, అఫ్రుబేగం, వెంకటేశం, శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు, లావణ్య, లక్ష్మి ఉన్నారు.

ఎస్సీని కలిసిన ఎస్సైలు

వికారాబాద్, ఫిబ్రవరి 8 : ఇటీవల బదిలీలు అయిన ఎస్సైలు గురువారం వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేశారు. కరణ్‌కోట్ ఎస్సైగా విఠల్‌రెడ్డి, మోమిన్‌పేట ఎస్సైగా అరవింద్, పెద్దేముల్ ఎస్సైగా గిరెన్న, చన్గోముల్ ఎస్సైగా మధుసూద న్‌రెడ్డి, బషీరాబాద్ ఎస్సైగా రమేశ్, ధారూ రు ఎస్సైగా వేణుగోపాల్‌గౌడ్ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డిని ఎస్పీ కార్యాలయంలో కలిశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962